శతవసంతాల.. టౌన్ చర్చి

- క్రైస్తవ మత ప్రచారంలో సుదీర్ఘ చరిత్ర
- ఇక్కడి మార్టిన్ లూథర్ విగ్రహం ప్రపంచంలోనే రెండోది
- నేటి నుంచి శతవార్షిక మహోత్సవాలు



క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి)

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చికి ఇప్పుడు శతవసంతాలు. ఈనెల 10,11,12 తేదీల్లో శతవార్షిక మహోత్సవాలు జరుపుకునేందుకు అంగరంగ వైభవంగా సిద్ధమైంది. ఇందుకోసం చర్చిలో పలు నిర్మాణాలను ముందుగానే పూర్తిచేశారు. స్థానికులు టౌన్‌చర్చిగా పిలుచుకునే ఈ క్రీస్తు దేవాలయం అన్ని హంగులతో కూడిన ప్రార్థనామందిరంగా అందుబాటులో ఉంది. టౌన్ చర్చి చరిత్రను తెలుసుకోవటం సందర్భోచితం.



రెవ.జార్జి రేమండ్ హాఫ్ దంపతులు

క్రైస్తవులు ఏసుక్రీస్తును అవతార పురుషునిగా భావిస్తారు. బైబిలులోని సువార్తలు క్రీస్తు ప్రవక్త బోధనలను తెలియజేస్తాయి. విశ్వజనీనత, పరలోక రాజ్యప్రాప్తి సిద్ధాంతాలను క్రీస్తు బోధించారు. బ్రిటిష్ వారి రాకతో ఏర్పాటైన క్రైస్తవ సమాజాలు మతవ్యాప్తికి తోడ్పడుతూ విద్య, ఆరోగ్య రంగాల్లో ఇతోధిక సేవలను అందించాయి. పవిత్ర జీవనాన్ని పెంపొందించాయి. ఆ విధంగా తెనాలిలో దాదాపు అన్ని మత శాఖలు ప్రసిద్ధి చెందాయి. రోమన్ కాథలిక్, లూథరన్, బాప్టిస్ట్, వల్డ్ మిషనరీ ఇవాంజిలిమ్, రక్షణ సైన్యం, బైబిలు మిషనుతోపాటు మరెన్నో పట్టణంలో కనిపిస్తాయి. స్వతంత్రపరమైన సిద్ధాంతాలు వేర్వేరుగా ఉన్నా, అందరూ ఏసుక్రీస్తును, బైబిలును ఆరాధిస్తారు. మార్టిన్ లూథర్ సిద్ధాంతాలను నమ్మి ఏసు క్రీస్తును అంగీకరించిన వారు లూథరన్ క్రిస్టియన్లుగా ప్రపంచవ్యాప్తంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. లూథరన్ చర్చి 1820లో ఏర్పాటై, ప్రపంచ దేశాల్లో మత ప్రచారం ఆరంభించింది.

అందులో భాగంగా నిర్మించిన వివిధ మత శాఖల ప్రార్థనాలయాల్లో ఆంధ్రా ఇవాంజెలికల్ లూథరన్ చర్చి ప్రముఖమైంది. పట్టణ బోసురోడ్డులోని ఈ క్రీస్తు దేవాలయం టౌన్ చర్చిగా ప్రముఖమైంది. బ్రిటిష్ మిషనరీ రెవరెండ్ జార్జి రేమండ్ హాఫ్ 2025లో ఈ చర్చి నిర్మాణం చేశారు. నిమ్నవర్గాలు, దళితులకు విద్యాలయం, వైద్యాలయం ద్వారా సేవలను అందించారని చెబుతారు. టౌన్ చర్చి నిర్మాణానికి అవసరమైన కొండరాళ్లను సింగపూర్ నుంచి మచిలీపట్నం ఓడరేవు ద్వారా జలమార్గంలో తెనాలికి తెప్పించారు. రంగూన్ నుంచి రప్పించిన మేలు రకం టేకు కర్రతో ఇక్కడి దర్వాజాలు, కిటికీలు చేయించారు. ఆర్కిటెక్ట్ పరిజ్ఞానంతో ఈ క్రీస్తు దేవాలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.



ప్యారిష్ పాస్టర్ రెవ.డి.ఏసురత్నం

బ్రిటిష్ మిషనరీలు రెవరెండ్ జీఆర్ హాఫ్ 1914–28 వరకు, రెవరెండ్ డాక్టర్ విక్టర్ మెకాలే దంపతులు 1928–34, రెవరెండ్ డుంకుల్ బర్గర్ 1935–39, 1945–50 వరకు తెనాలిలో సేవలందించారు. అప్పట్లో రేపల్లె కూడా తెనాలి డివిజను పరిధిలో ఉండేది. 1923లో రెవరెండ్ జీఆర్ హాఫ్, రేపల్లెను ప్రత్యేక జోనుగా చేశారు. రెవరెండ్ హారిని తొలి మిషనరీగా నియమించారు. ఏఈఎల్‌సీ అధ్యక్షుడిగా కాకి నతానియేల్ ఉన్నపుడు 1990లో టౌన్‌చర్చిని ఆధునీకరించారు. చర్చి ఆవరణలో సంస్కరణవేత్త, క్రైస్తవ మతప్రచారకుడు మార్టిన్ లూథర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ విగ్రహం ప్రపంచంలోనే రెండోదిగా ఆవిష్కారమైనట్టు చెబుతారు. దీనికిముందు కళాకారుడు పాల్ ప్రభాకర్ ఏసుక్రీస్తు పెయింటింగ్‌ను చిత్రీకరించారు. ప్రతి ఆదివారం ప్రార్థనలతోపాటు, క్రైస్తవ పండుగలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తుంటారు. క్రిస్మస్ పండగకు విద్యుత్ అలంకరణ, రంగురంగుల క్రిస్మస్ స్టార్లతో చర్చిని అలంకరిస్తారు. క్రైస్తవేతరులు కూడా చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటూ ఉంటారు.

2018–19లో చర్చికి అవసరమైన మరమ్మతులు చేసి, మరింత శోభను తీసుకొచ్చారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా భారీ వ్యయంతో సండే స్కూలు, మీటింగ్ హాలు, స్త్రీల సమాజం నిర్మించారు. చర్చికి ఇరువైపులా రూఫ్‌ను పక్కాగా ఏర్పాటు చేశారు.

ఫ్లోరింగ్, ప్రధాన గేటును ఆధునికీకరణను పూర్తి చేసి, అన్ని హంగులను కల్పించారు. ఏ క్లాస్ ప్యారీష్‌గా వ్యవహరిస్తున్న ఈ క్రీస్తు లూథరన్ దేవాలయానికి ప్రధాన గురుమండల అధికారిగా రెవ.దేవరపల్లి ఏసురత్నం ఉన్నారు. అడిషనల్ పాస్టర్లుగా వై.లెనిన్‌బాబు, డి.సాల్మన్‌రాజు, ఎంవీబీ ప్రకాష్ బాబు వ్యవహరిస్తున్నారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా ఐ.డేవిడ్‌రాజు, డాక్టర్ జి.శ్యామ్‌ప్రకాశరావు, సీహెచ్ ఫ్రాన్సిస్ జేవియర్, ఎస్.జాన్‌మోహన్, సీహెచ్ సునీల్‌కుమార్, కె.చంద్రకుమార్, జి.దేవదానం, జి.వేమయ్య, కె.అంబేడ్కర్, బి.కిషోర్‌బాబు, బి.బుజ్జిబాబు, ఎన్.జోసెఫ్ కృపాసాగర్, జె.శ్యామ్‌కుమార్, జి.రాజు, కన్వీనర్‌గా పిల్లి విద్యాసాగర్ ఉన్నారు.

తెనాలిలో కార్మిక సంఘాలు ర్యాలీ

తెనాలి: కేంద్రప్రభుత్వ తీసుకొచ్చిన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ కాంప్లెక్స్ నుండి ఆరంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు, బోసురోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు కొనసాగింది. అక్కడ ర్యాలీ నుద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ ప్రసంగించారు. అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, యూటీఎఫ్ నాయకులు షేక్ అహ్మద్ హుస్సేన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పద్మ, దాల్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జీవీ సుబ్బయ్య, సీహెచ్ శేషగిరిరావు, బ్రేవరెజెస్ ముఠా యూనియన్ నాయకులు చినగోపాలరావు, మల్లికార్జునరావు, మార్కెట్‌యార్డు ముఠా నాయకులు సీహెచ్ వీరాంజనేయులు, రవికుమార్, 'ఆశా' యూనియన్ నాయకులు ఝాన్సీ, లక్ష్మీసుజాత, మెడికల్ హెల్త్ యూనియన్ నాయకులు శ్యామ్, ఎండీఎం యూనియన్ నాయకులు రెడ్డి రమణమ్మ, రాడ్‌బెండింగ్ నాయకుడు బి.నాగేశ్వరరావు, కె.రవికుమార్, శెట్ట ఏసోబు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎం.సాంబశివరావు, పోస్టల్ యూనియన్ నాయకడు జోనెష్, ప్రసాద్, ఉమమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బోసురోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికసంఘాలు

రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలి

తెనాలిరూరల్: మండలంలో చావవారిపాలెం, అంగలకుదురు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. సుధీర్ బాబు మాట్లాడుతూ రైతులకు విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. వరి విత్తనాలను కార్బన్‌డిజమ్ లేదా సుడోమోనస్ జీవ శిలీంద్ర నాశనితో శుద్ధి చేయాలని వివరించారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద వరి, మినుము పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూలై 31వ తేదీ లోపు సీఎస్‌సీ సెంటర్ల ద్వారా లేదా బ్యాంకుల ద్వారా ప్రీమియం చెల్లించాలని చెబుతూ వరి పంటకు ఎకరాకు రూ. 800 ప్రీమియం, మినుము పంటకు ఎకరాకు రూ. 200 ప్రీమియం చెల్లించాలన్నారు. విత్తన శుద్ధిని వివరించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతు కార్డులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ, ఏఈవోలు, రైతులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



విత్తన శుద్ధిని వివరిస్తున్న ఏవో సుధీర్‌బాబు

గుంతలు పూడ్చేందుకు చర్యలు

తెనాలిఅర్బన్: కంపోస్ట్ యార్డు ఆవరణలోని గుంతలను వెంటనే పూడ్చాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డును బుధవారం ఆయన పరిశీలించి చెత్త తరలింపు ప్రక్రియపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల శస్త్ర చికిత్సాలయంలో శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్నారు. ఆవరణ పల్లంలో ఉండటం వల్ల నీరు నిలుస్తుందని చెప్పారు. ఆయన వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు, పలువురు ఏఈలు, సిబ్బంది ఉన్నారు.

వృద్ధులను ఆదుకోవడం అభినందనీయం

నగరంపాలెం: సమాజంలోని పేద, బలహీన వర్గాలకు మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనివ్వడం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. కాకాని రోడ్డులోని ఓ కన్వెన్షన్‌లో బుధవారం రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామకృష్ణయ్య జన్మదినం సందర్భంగా 300 మంది పేద వృద్ధులకు రూ.400 చొప్పున మూడు నెలల పెన్షన్‌ను ఎమ్మెల్యే మాధవి అందించారు. ఆమె మాట్లాడుతూ వ్యాపార ధర్మాలను నిర్వర్తిస్తున్న ఆర్యవైశ్యులు తాము ఆర్జించిన లాభాల్లో కొంత సేవా కార్యక్రమాలకు నిర్వర్తించడం ప్రసంశనీయమని అన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు రామకృష్ణయ్య మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వృద్ధాప్య పెన్షన్లకు రూ.60 లక్షలు వరకు అందించినట్లు చెప్పారు. పింఛన్లతోపాటు వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు మద్దు జయలక్ష్మి, భావన్నారాయణ, డాక్టర్ దేవి వైష్ణవి, శ్రీమన్నారాయణ హర్షిత, సత్యవతి, నంబూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



వృద్ధునికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే, ట్రస్ట్ నిర్వాహకులు

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అదనంగా బుధవారం మరో కొత్త ఎస్‌ఐను కేటాయించారు. పల్నాడు గుంటూరు జిల్లాలో విధులు నిర్వహించిన స్వామి శ్రీనివాస్‌ను తాడేపల్లికి బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ వీరేంద్రకు పుష్పగుచ్ఛం అందించి విధుల్లోకి చేరారు. తాడేపల్లిలో సీఐ వీరేంద్రతో పాటు ఎస్‌ఐలుగా ప్రతాప్‌కుమార్, ఖాజావలి విధులు నిర్వహిస్తుండగా స్వామి శ్రీనివాస్ మూడో ఎస్‌ఐ అయ్యారు.


లింగాకర్షక బుట్టలతో పురుగు నివారణ

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత వెంకటలక్ష్మీ మాట్లాడుతూ.. ఎరువులు అధికంగా వాడకూడదని చెప్పారు. దీని ద్వారా నేల స్వభావం మారుతుందన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు తప్పనిసరిగా రైతులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏవో వాసంతి మాట్లాడుతూ.. రైతులు సీజన్లో పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదుతో ప్రభుత్వ పథకాలకు ఆమోదం పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో విస్తరణాధికారి షేక్.సుభాని, సహాయకులు శివారెడ్డి, గణేష్, ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధి సాయి, ఐసీఆర్పీ పెద్దారావు, రైతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

పొన్నూరు: పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు భద్రత కరువైంది. తాము చెప్పింది ఎందుకు చేయలేదంటూ ఉద్యోగులతో అమర్యాదగా వ్యవహరిస్తూ దుర్భాషలాడుతుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చి హల్‌చల్ చేశారు. తాము ఇచ్చిన అర్జీని ఎందుకు పరిష్కరించలేదని కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సుశీల్‌పై విరుచుకుపడ్డారు. నానా దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురిచేశారు. తాము ఆషామాషీ మనుషులం కాదని, తమాషాగా ఉందా అంటూ.. తమ పని ఆగడానికి వీల్లేదని ఉద్యోగిని హెచ్చరించారు. కార్యాలయం సూపరింటెండెంట్ ఆరేటి మాధవి అక్కడికి చేరుకుని రికార్డు మీకు ఇవ్వాల్సిన పని లేదని, ఇక్కడి నుంచి వెళ్లాలని చెప్పడంతో.. ఆమెతో సైతం దురుసుగా మాట్లాడారు. వీడియో తీస్తున్న పలువురిపై వెంటనే డిలీట్ చేయాలని దౌర్జన్యానికి దిగారు. ఈ సంఘటనతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై కార్యాలయం సూపరింటెండెంట్ ఆలేటి మాధవి మాట్లాడుతూ కార్యాలయంలో జరిగిన సంఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అర్జీతో సంబంధం లేని వ్యక్తి దుర్భాషలాడుతూ ఉద్యోగితో అమర్యాదగా వ్యవహరించాడన్నారు. కార్యాలయంలోని సీసీ ఫుటేజీలో జరిగిన సంఘటన దృశ్యాలన్నీ రికార్డయ్యాయని తెలిపారు.

కాపు సమస్యల కోసం ఉద్యమిస్తాం



తాడేపల్లి రూరల్: కాపులకు బీసీ రిజర్వేషన్ కోసం ఉద్యమిస్తామని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్దన్ స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఏసీ సమావేశంలో ఇటీవల పలు తీర్మానాలను ఆమోదించారని.. ఈ తీర్మానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్ ఆధ్వర్యంలో వినతి పత్రాలను టీడీపీ, జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాల్లో అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు జొన్న రాజేష్, దాసరి దుర్గా మల్లేశ్వరరావు, చవ్వాకుల కోటేష్‌బాబు, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, నవీన్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మిక చట్టాల రద్దు దుర్మార్గం

కొల్లిపర: బ్రిటిష్ కాలం నుంచి ఇప్పటి వరకు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ప్రభుత్వాలు రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోట్లుగా మార్చటం దుర్మార్గం అని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్ భావనారాయణ అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కొల్లిపర సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు బుధవారం సమ్మె, ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి ఎం.జైప్రద అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంకు అధికారి కొల్లి శివనాగిరెడ్డి, నిర్మల జ్యోతి, జి.సుందర్‌రావు, మల్లోల రమేష్, దేవ కుమారి, శేషారత్నం, గీతాబాయి, షేక్ అజారుద్దీన్, ఆషా కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయి.. క్షేమంగా ఇంటికి చేరిన బాలుడు



తెనాలిరూరల్: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని తెనాలి త్రీటౌన్ పోలీసులు తల్లిదండ్రులకు అపపగించారు. సుమారు రెండేళ్ల వయసు ఉన్న బాలుడు బుధవారం సుల్తానాబాద్ మెయిన్ రోడ్డు సమీపంలో వైన్ షాపు ఎదురుగా తిరుగుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు అప్పగించారు. బాలుడికి మాటలు రావడం లేదని సుమారు రెండు సంవత్సరాల వయసు ఉంటుందని సీఐ రమేష్ బాబు తెలిపారు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు వెతుక్కుంటూ రాగా బాలుడిని పోలీసులకు అప్పగించారని స్థానికులు చెప్పడంతో వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తల్లిదండ్రులు సుల్తానాబాద్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటారని, బాలుడు ఆడుకుంటూ రోడ్డు మీదకు వచ్చాడని తెలుసుకున్న పోలీసులు వారికి అప్పగించారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

కొల్లిపర: విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంగా బాధ్యతగా విధులు నిర్వహించాలని విద్యుత్ ఈఈ చిరంజీవి అన్నారు. మండలంలోని పలు గ్రామాలల్లో బుధవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది కలసి వినియోగదారులు విద్యుత్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. మండలంలో డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరుమామిళ్ళపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 60 బృందాలుగా ఏర్పడి 4వేల 447 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయగా 145 సర్వీసులకు అదనపు లోడ్ వినియోగంపై రూ.5 లక్షల 60 వేల 300లను, విద్యుత్ చౌర్యం కింద రూ.70 వేలు అపరాధ రుసుం విధించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ కె.రాజశేఖర్, విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్, సబ్‌ఇంజనీర్ జి.సత్యన్నారాయణ, డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వినుకొండ: మండలం గోనుగుంట్లవారిపాలెం (రావిచెట్టు) నుంచి మదమంచిపాడు వెళ్లే మార్గంలోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వినుకొండ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ రూరల్ మండలం గోనుగుంట్లవారిపాలెం గ్రామం పొలంలో సుమారు 30 ఏళ్ల వయస్సు ఉండవచ్చని అంచనా. మృతదేహంపై తెలుపు రంగు చొక్కా, నలుపురంగు లోయర్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. రెండు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వివరాలకు వినుకొండ టౌన్ పోలీస్‌స్టేషనులో సంప్రదించాలని సి.ఐ శోభన్‌బాబు తెలిపారు.

పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

అవగాహన సదస్సులో తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



తెనాలి: ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పీ4 కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆదేశించారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. అధ్యక్షత వహించిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పీ4 సర్వేను పూర్తిచేసినట్టు గుర్తుచేశారు. ఇందులో బంగారు కుటుంబాలను గుర్తించటం జరిగిందనీ, వారి అవసరాలను గుర్తించటానికి ఇప్పుడో కొత్త సర్వే చేయాల్సి ఉందన్నారు. సంబంధిత మార్గదర్శకాలను తెలియజేశారు. మార్గదర్శకులు ఎవరైతే ఉన్నారో వారిని ఎన్యూమరేట్‌కు మరో సర్వే చేయాలని సూచించారు. ఆగస్టు 15లోగా 11,172 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సిన లక్ష్యాన్ని నెరవేర్చాలని చెప్పారు. వార్డులవారీగా, గ్రామాలవారీగా జరపాల్సిన సర్వే అంశాలను వివరించారు. తొలుత సంబంధిత కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

కుటుంబ వివాదంపై కేసు నమోదు

కొల్లిపర: మండల పరిధిలో అన్నవరం గొడపాలెం గ్రామంలో పొలం వద్ద గొడవ పడి ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. అన్నవరం గొడపాలెం గ్రామంలో అద్దంకి గోపికృష్ణ, అతని తమ్ముడు శివరామకృష్ణ, వారి తండ్రి వెంకటేశ్వరరావులు పొలం దగ్గర గొడవ పడ్డారు. ఈ వివాదంలో గోపీకృష్ణకి అతని తమ్ముడు శివరామకృష్ణకు గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పుస్తకాలు పంపిణీ

తెనాలిఅర్బన్: కృపా సత్య మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని ఎస్‌కె ఎయిడెడ్ స్కూల్‌లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు బిషప్ యేసుదాసు టైటస్, హెచ్‌ఎం అరుణ కుమారి, ఎంపీ పుష్పరాణి, క్లాప్స్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి గోవింద్, దోప్పలపూడి ప్రవీణ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.